## పేదలకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో ప్రయోజనం

### ఎమ్మెల్యే సునీతారెడ్డి

**వెల్దుర్తి, ఆగస్టు 26, ప్రభాతవార్త:**
పేద కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతగానో ఉపయోగపడతాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు.సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తి లోని శ్రీ బాలాజి ఫంక్షన్ హాల్లో బిఆర్ఎస్ అధ్వర్యంలోఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు వ్యాధులు సోకుతున్నాయని అన్నారు.అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడ చల్లడం లేదన్నారు.ఈ మేరకు వెల్దుర్తి కి 41, మాసాయిపేటకు 6 సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పిటీసి రమేశ్‌గౌడ్, మన్సూర్, నాయకులు భూపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అనంతరెడ్డి, కృష్ణాగౌడ్, మదుసూదన్‌రెడ్డి, రాంచందర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**కోహెడ, ఆగస్టు 26, ప్రభాతవార్త :** అప్పుల బాధతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోహెడ మండలం వింజపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే వింజపల్లి గ్రామానికి చెందిన నంగునూరి తిరుపతి కరీంనగర్‌లోని చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ 15 సంవత్సరాలుగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోగల వారి రెండు ఎకరాలను చూసివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం తిరుపతి సోదరుడు నంగునూరి యాదగిరితో పాటు వారి పొలం కౌలుకు చేసే వ్యక్తులు ఇద్దరు భార్య భవానికి ఫోన్‌చేసి పొలం వద్ద తన భర్త తిరుపతి పురుగుల మందు తాగి మృతి చెంది ఉన్నాడని తెలపారని పోలీస్‌స్టేషన్ ఇచ్చిన ఫిర్యాదులో తిరుపతి భార్య తెలిపింది. తిరుపతి అప్పులు ఉన్నాయని బాధపడేవాడని, సౌది వెళ్లాలని రెండు సార్లు ముంబయికి మెడికల్ టెస్ట్‌లకు వెళ్లినా మెడికల్‌లో ఫెయిల్ అయ్యారని చేసిన అప్పులు తీర్చలేక పుగుగుల మందు తాగి చనిపోయాడని తన చావుపట్ల వారికి వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానం లేదని తెలిపింది. అయితే మృతుడికి ఒక కుమారుడితో పాటు భార్య ఉండడంతో ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

### చోరీలు, మత్తుపదార్థాల నివారణకు

## జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ

### సిపి అనురాధ

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి :**
రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణ, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా నివారించడానికి జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని సీపీ డా॥అనురాధ అన్నారు. సీపీ కార్యాలయంలో పరిధిలో ఆదివారం రాత్రి గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్, పట్టణాలలో వాహనాల తనిఖీలతోపాటు లాడ్జిలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ డా॥అనురాధ మాట్లాడుతూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించకుండా నంబర్ ప్లేట్‌లోని తదితర ట్రాఫిక్ వైలేషన్‌పై 350 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ 62 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులపై ఫింగర్ నఫ్రింట్ డ్రైవ్ ద్వారా 225 వ్యక్తులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. తరచుగా వాహనాల తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలకు నంబర్‌ప్లేటు బిగించుకోవాలన్నారు. కార్యక్రమం లో సీఐలు లక్ష్మీబాబు, విద్యాసాగర్,ఉపేందర్, శ్రీను, సైదా లతీఫ్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, మురళి, పోలీసులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో 30 దుకాణాలు సీజ్



ఏడుపాయల్లో దుకాణాలను సీజ్ చేస్తున్న దృశ్యం

**పాపన్నపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:** పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ ఆవరణలోని తాత్కాలిక 30 దుకాణాలను ఆలయ సిబ్బంది సోమవారం పోలీసుల బందో బస్తు మధ్య సీజ్ చేశారు. దేవాదాయ శాఖ అనుమతులు లేకుండా దుకాణాలను చేసుకోవడం, అనుమతులు పొంది ఏర్పాటు చేసుకున్న దుకాణాలకు కిరాయిలు చెల్లించకపోతుండటంతో దాదాపుగా 30 దుకాణాలను సీజ్ చేశారు. ఆలయ ఈఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ దుకాణాలను మూసి వేయాలని ఆదేశించడంతో సిబ్బంది పోలీసుల సహకారంతో దుకాణాలను సీజ్ చేశారు.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం చూపుతున్న గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి

**మర్కుక్, ఆగస్టు 26 (ప్రభాతవార్త):** రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినా, రవాణా చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, మర్కుక్ ఎస్ఐ దామోదర్‌లు హెచ్చరించారు. సోమవారం మర్కుక్ పోలీసులు నర్సన్నపేట గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో యాదాద్రి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన మాలోత్ నవీన్ టిఎస్07 యుజి1155 నెంబర్ గల వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా 38 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనంతో పాటు రేషన్ బియ్యం సీజ్ చేసి నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ దామోదర్‌లు మాట్లాడుతూ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసినా, నిల్వ ఉంచినా వారిపై కేసు నమోదుచేసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.జూదం, గ్యాంబ్లింగ్, చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా, మాదక ద్రవ్యాలు విక్రయించినా, సేవించినా తమ దృష్టికి తీసుకురావాలని లేదా డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు.

### మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలిసిన కాంగ్రెస్ నేతలు

**మునిపల్లి, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహాను సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిల్లోడు సతీష్ ఆధ్వర్యంలో నాయకులు కలుసుకున్నారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను నాయకులు మంత్రి దృష్టికి తీసుకుపోయారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామి చేసినట్లు పిల్లోడు సతీష్ పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపిటిసి సభ్యులు సుధాకర్‌రెడ్డి, నాయకులు ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**మిరుదొడ్డి, ఆగస్టు 26, ప్రభాతవార్త :** దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దెల రాజేశం సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దెల సుదర్శన్, చెన్నై భూపాల్‌గౌడ్, నేరెండ్ల భూమాగౌడ్,అల్లిబిల్లి కుమార్, మల్కాపురం నర్సింలు, హమాలీ ఎల్లయ్య, మల్యాల బాలకిషన్ తదతరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా మారిన పలు గ్రామాల రోడ్లు

### నిలిపివేసిన ఆర్టీసి బస్సులు.. పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నర్సాపూర్ మండల పరిధిలో అధ్వానంగా మారిన కొండాపూర్ నుండి నత్నాయపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు

**నర్సాపూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**
మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. అంతేగాక రోడ్లు గుంతలమయంగా మారడంతో నర్సాపూర్ ఆర్టీసీ డిపో నుండి బస్‌లను నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రయాణీకులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు నర్సాపూర్ మండల పరిధిలోని నర్సాపూర్ హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు నుండి కొండాపూర్,కాగజ్ మద్దూర్ గ్రామం మీదుగా నత్నాయపల్లి సంగారెడ్డి జిల్లా శేర్‌ఖాన్‌పల్లి గ్రామాల రోడ్లు గుంతలమయంగా మారింది. దీంతో ఈ గ్రామాలమీదుగా పటాన్‌చెరువు వెళ్లే ఆర్టీసీ బస్‌లను రద్దు చేశారు. బస్ లురద్దు కావడంతో ఈ రూట్లలోని గ్రామాల ప్రజలు వెళ్లాలంటేనే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా నర్సాపూర్ మెదక్ వెళ్లే ప్రధానరోడ్డు రెడ్డిపల్లి చౌరస్తా నుండి చిప్పల్‌తుర్తి మీదుగా ఇబ్రాహీంబాద్‌కు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారడంతో ఈ గ్రామాల ప్రజలు సైతం ఎన్నో అవస్థలు పడుతున్నారు. కాగా గూడెంగడ్డ గ్రామానికి వెళ్లే రోడ్డూ గుంతలమయం కాగా ఆ గ్రామాల ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. అంతేగాక మండల పరిధిలోని అహ్మద్‌నగర్ గ్రామ పరిధిలోనున్న జువ్విపోచమ్మ తండాకు మట్టి రోడ్డు మాత్రమే ఉంది. దీంతో ఈ తండావాసులు వర్షాకాలం వచ్చిందంటే నరకయాతనలు అనుభవిస్తు ప్రయాణాలను సాగిస్తున్నారు. ఈ తండాకు తారు రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులకు వినతి చేసినా ఎవరూ పట్టించుకున్న పాపానాలేదు. తారు రోడ్డుకు నిధులు మంజూరుచేయాలని తండావాసులు కోరారు. అలాగే మండల పరిధిలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తూ పలు ప్రమాదాలకు గురవుతున్నారు.కాగా ఆర్టీసి అధికారులు రోడ్లు బాగా లేవన్న కారణంతో ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్‌లను రద్దు చేయడంతో ప్రయాణీకుల, ప్రజల అవస్థలు వర్ణనాతీతం. రోడ్లన్ని బాగుంటేనే ఆయా గ్రామాల ప్రజలకు, ప్రయాణీకులకు ఎంతో సౌకర్యం ఉంటుంది. కాగా ఈ రోడ్లన్ని అధ్వానం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు అష్టకష్టాలు పడుతూ ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని గ్రామాల రోడ్లను పరిశీలించి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అధ్వానంగా మారిని నర్సాపూర్ మండల పరిదిలోని పలు గ్రామాల రోడ్లను బాగుచేయించి ఆర్టీసిబస్‌లను నడిపేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీ దృశ్యం

## మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని తీసుకురావాలి

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం జన విజ్ఞాన వేదిక 5వ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని వెంటనే తీసుకరావాలని, అన్ని జిల్లా కేంద్రాలలో జ్ఞానిక ప్రయోగశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, ఎస్సీ ఈఆర్టీ పాఠ్యపుస్తకాలలో నుంచి తొలగించిన ద్వారిన్ సిద్దాంతాన్ని , పిరియాడిక్ టేబుల్లు తిరిగి పున:రుద్ధరించాలని జంతువుల నుంచి జంతువులకు మనుషులకు వచ్చే వ్యాధుల దినోత్సవం వరల్డ్ జునోసిస్ దినోత్సవాన్ని రాష్ట్ర వాప్తంగ జూలై మాసంలో నిర్వహించాలని పలు తీర్మాణాలు చేశారు. జన విజ్ఞాన వేదక రాష్ట్ర సెక్రెటేరియట్ సభ్యులు, జిల్లా ఇంచార్జి నరసింహులు, జిల్లా అధ్యక్షులు ఎం.బాలరాజు మాట్లాడారు.

**జిల్లా నూతన కమిటీ**

తెలంగాణ జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తుమ్మ సత్యం, గౌరవాధ్యక్షులుగా పి.నర్సింలు,ఎం.బాలరాజు, ఉపాధ్యక్షులుగా రాజమౌళి, పి.బాలకిషన్, సి.హెచ్.రామచంద్రం, ప్రధాన కార్యదర్శి గా కె.కనకరాజు,కార్యదర్శులుగా ఎ.లింగం, కె.ప్రశాంత్, నవీన్‌లను ఎన్నుకున్నారు. కోశాధికారిగా ఎం.డి.అజీజ్, సబ్ కమిటీ కన్వీనర్లగా విద్య: కే.మహేందర్, ఆరోగ్యం: జి.ప్రవీణ్‌కుమార్, పర్యావరణం: కె.దేవయ్య, సాంస్కృతిక కమిటీ బ్రహ్మం, చెకుముకి, పబ్లికేషన్స్ : ఎం.డి. సాదత్ అలీలను ఎన్నుకున్నారు.

### యూనిఫైడ్ పెన్షన్ వద్దు.. పాత పెన్షన్ విధానమే ముద్దు

**-టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు**

**సిర్గాపూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** యూనిఫైడ్ పెన్షన్ వద్దని పాత పెన్షన్ విధానమే ముద్దు అని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్‌లు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో 1 ఏప్రిల్ 2025 నుంచి కొత్త పెన్షన్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. 25 సంవత్సరాల సర్వీసు చేసిన ఉద్యోగి చివరి 12 నెలల జీతంలో 50శాతం పెన్షన్‌గా చెల్లిస్తారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం పెరిగినప్పుడు పెన్షనర్లకు కూడా పెరుగుతుందని,గతంలో వలెనే గ్రాట్యూటీ కూడా ఉంటుందన్నారు. 6నెలల సర్వీసుకు ఒక నెల జీతం, కరువు భత్యంలో 10శాతం అదనపు గ్రాట్యుటీగా చెల్లిస్తారన్నారు. సిసిఎస్ పథకంలో వలెనే ఉద్యోగ జీతంలోనుంచి 10 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. ఇది సిపిఎస్‌కు మరో రూపమే తప్ప పాత పెన్షన్ విధానం కాదన్నారు. కేవలం 5 సంవత్సరాలు ప్రజాప్రతినిధులుగా పనిచేసినందుకు శాసనకర్తలు ఏకవాక్య ఆమోదంతో జీవిత కాలం పెన్షన్ అందుకుంటున్నారని, అపాయింట్‌మెంట్ నుంచి విరమణ పొందే వరకు ప్రభుత్వానికి తమ జీవితం దారపోస్తే చివరికి గ్యారంటీ లేని సిపిఎస్ విధానం మాదిరిగా కొత్త పేరుతో అదే విధంగా అమలు చేయట అశాస్త్రీయం అని, సిపిఎస్ కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచనల చేయకపోవడం విడ్డూరంగా ఉందని విచారం వ్యక్తం చేశారు. పాత పెన్షన్‌ను పునరుద్దరించాలని, కొత్త పెన్షన్ విధానం వద్దని నాగారం శ్రీనివాస్, రాంచందర్‌లు డిమాండ్ చేశారు.

### నిలిపి వేసిన అభివృద్ధి పనులకు నిధులను
### తక్షణమే మంజూరు చేయాలి : ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, ఆగస్టు 26. ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నర్సాపూర్ నియోజకవర్గానికి మంజూరైన ఎస్‌డిఎస్, ఆర్ అండ్ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను నిలిపి వేయడం అన్యాయమని అదేవిధంగా నిలిపివేసిన అభివృద్ధి పనుల కోసం నిధులను తక్షణమే ప్రభుత్వం మంజూరుచేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న నర్సాపూర్ నియోజకవర్గానికి ఏ ఒక్క పైసా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయలేదన్నారు. ఈ మేరకు ఈ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రలకు వినతి చేసినా పట్టించుకోవడంలేదని తెలిపారు. కాగా ఈ మంత్రులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. నర్సాపూర్ నియోజకవర్గానికి కొత్తగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయక పోవడమే కాక ఇంతవరకు మంజూరైన నిధులను నిలిపివేయడం ఎంత వరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు.దీంతో ఇంతవరకు సగం వరకు నిలిచిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నర్సాపూర్‌నియోజకవర్గానికి మంజూరైన ఎస్‌డిఎఫ్, అర్‌అండ్ ఎస్టీ సబ్ ప్లాన్‌నిధులను మంజూరు చేయడానికి ఆదేశాలివ్వాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో తండాలకు వెళ్ళే రోడ్లన్ని అధ్వాన్యంగా మారాయని ఆ రోడ్లకు సైతం నిధులు మంజూరు చేయాలని అన్నారు.ఇంతకు ముందు మంజూరైన 46 కోట్ల 36 లక్షల నిధులు తక్షణమే నర్సాపూర్ నియోజరవవర్గానికి మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే సునీతారెడ్డి హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, నాయకులు రింగుల ప్రసాద్, కాజెశ్, సలీం, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో భక్తిశ్రద్దలతో కృష్ణాష్టమి

**సంగారెడ్డి బ్యూరో ఆగస్టు 26, ప్రభాతవార్త:** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సంగారెడ్డి జిల్లాలో సోమవారం ఘనంగా జరిగాయి. జిల్లాలోని ఆయాగ్రామాల్లోని అలయాలో భక్తుల పాల్గొని, భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. ఉదయం నుండి అలయాల వద్ద,భక్తులు అధికంగా కనిపించించారు. సంగారెడ్డిలోని శ్రీమరళీకృష్ణ అలయంలో, శ్రీకృష్ణ దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో హజరై పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల ఉట్టిలను కొట్టారు. శ్రీమురళీకృష్ణ అలయంలో జరిగిన శ్రీకృష్ణ జాన్మష్టమి వేడుకలలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని పూజలు నిర్వహించారు.అలయ నిర్వాహకులు చింతాప్రభాకర్‌కు అలమ మర్యాదలతో స్వాగతం పలికారు.ఈసందర్భంగా జ్ఞాపికను అందజేశారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**శివ్వంపేట, ఆగస్టు 26 (ప్రభాతవార్త)**
చికిత్స పొందుతూ మహిళా మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం... కొత్తపేట గ్రామానికి చెందిన సుండు ఇందిరమ్మ(38) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈనెల 19న మధ్యాహ్నం కొత్తపేటలో పురుగుల మందు తాగి రాఖీ కట్టడానికి ఆమె పుట్టిల్లు రామయపల్లి గ్రామనికి వెళ్లి ఇంట్లో కింద పడిపోగా ఆమెను చికిత్స నిమిత్తం మెదక్ హస్పిటల్‌కి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలిచారు. ఈ నెల 26న చికిచ్చ పొందుతూ ఉదయం 10 గంటలకు మృతి చెందింది. ఇందిరమ్మ కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నందున జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి గుండు వెంకట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపారు.

# లాడ్జీలపై కొరవడిన పోలీసుల నిఘా..!

**నారాయణఖేడ్, ఆగస్టు 26 ప్రభాతవార్త:**
వివిధ పనుల కోసం పట్టణానికి వచ్చేవారి కోసం అద్దెకు ఇవ్వాల్సిన లాడ్జీలు పరిశుభ్రత లేక కంపు కొడుతున్నాయి. నారాయణఖేడ్ పట్టణంలో సుమారు పది వరకు లాడ్జీలు ఉన్నాయి. లాడ్జీకి వచ్చిన వారి పేరు వివరాలు గుర్తింపు కార్డు లేకుండా వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్న నిర్వాహకులు సీసీ కెమెరాలు సైతం అందుబాటులో ఉంచడంలేదు. కొందరు కింది స్థాయి పోలీసు సిబ్బంది లాడ్జీ నిర్వాహకులతో మాముళ్ల లింకు పెట్టుకున్నారని ప్రజల నుంచి అభియోగాలు వినిపిస్తున్నాయి. నారాయణఖేడ్ డివిజన్ లో మనూరు, నాగల్‌గిద్దా, కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేట, పెద్దశంకరంపేట మండలాలు నారాయణఖేడ్ తాలుకా పరిధిలోకి వస్తాయి. పనుల కోసం హైదరాబాద్, బీదర్, మహారాష్ట్ర దూర ప్రాంతాల నుంచి నారాయణఖేడ్ పట్టణానికి వచ్చేవారి కోసం అతిథ్యాన్ని ఇవ్వాల్సిన లాడ్జీలు ఎక్కడ చూసిన పరిశుభ్రత లేక చెత్త చెదారంతో కంపుకొడుతున్నాయని లాడ్జీలకు వచ్చే వారు చెబుతున్నారు. నిత్యం పర్యవేక్షించాల్సిన పోలీసు నిఘా కరువు కావడంతో ఆయా లాడ్జీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**సిసి కెమెరాలపై పర్యవేక్షణ ఏది?:**

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో సిసి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి. నిబంధనల ప్రకారం లాడ్జీలలో సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు లాడ్జీలలో నెల రోజులపాటు భద్రపర్చాల్సి ఉంటుంది. ఎప్పుడైనా నేరాలు జరిగినపుడు లాడ్జీల లో రూమ్‌లు తీసుకున్న సందర్భంలో ఆ డేటా పోలీసులకు ఎంతో ఉపయోగపడుతుంది. లాడ్జీలకు ఎవరు వస్తున్నారు? ఎక్కడి నుంచి వస్తున్నారో కొన్ని లాడ్జీల వారు పట్టించుకోవడం లేదు. లాడ్జీలలో ఎవరు బస చేస్తున్నారు అనే దానిపై పోలీసులు నిఘా కొరవడిందని ప్రజలనుంచి పలువిమర్శలు వస్తున్నాయి.

**తనిఖీలు మొక్కుబడే...**

నారాయణఖేడ్ పట్టణంలో లాడ్జీలు ఉన్న వాటిపై పోలీసుల నిఘా కరువైంది. పోలీసుల తనిఖీలు మొక్కుబడిగా సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. నిబంధనాల ప్రకారం లాడ్జీల్లో బసచేసేవారి గుర్తింపు కార్డు ఆధార్‌కార్డు, ఓటరు కార్డు జిరాక్సు కాపీలను తీసుకోవాల్సి ఉంటుంది. కష్టమర్లు ఏదైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పిడిన సందర్భంలో వారి కుటుంబ సభ్యులకు పోలీసులకు వారి వివరాలు అందించడానికి లాడ్జీ నిర్వాహకులకు తేలికగా ఉంటుంది. అయితే గంటల లెక్కన రేటు కట్టి లాడ్జీలు అద్దెకిస్తున్న నేపథ్యంలో నిర్వాహకులు ఈ నిబంధనలు ఏమి పట్టించుకోవడంలేదు. స్కార్ఫులు కట్టుకుని మహిళలు, హెల్మెట్ ధరించి యువకులు లాడ్జీల్లోకి ఎంట్రీ ఇచ్చి గంటలకు మాట్లాడుకునేందుకు వినియోగించుకుంటున్నారు. అలాగే రేటు ఎక్కువ కట్టి రూములను జూదాలకు అద్దెకిస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లాడ్జీలపై పోలీసు నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



గజ్వేల్‌లో శ్రీకృష్ణుని పల్లకిసేవ నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 26 (ప్రభాతవార్త):**
శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సోమవారం గజ్వేల్ పట్టణంలోని శ్రీ మురళీ కృష్ణాలయంలో వేడుకలను సుందర సత్సంగ్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, 8 గంటలకు పల్లకిసేవ, 9 గంటలకు సువర్ణ కృష్ణునికి అభిషేకము, రజిత పుష్పార్చన, తులసిదళ అర్చన, మంగళహారతి, మంత్రపుష్పము చేయడంతో పాటు స్వామివారికి 56 రకాల ప్రసాదాల నివేదన చేశారు. వేడుకలకు హాజరైన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే రాత్రి 7 గంటలకు భజన కార్యక్రమం, 8.30 గంటలకు అల్పాహారము, 9 గంటలకు భగవద్గీత పోటీలు, భజన, రాత్రి 12 గంటలకు డోలోత్సవం కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ వేడుకల్లో పట్టణంతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. 27వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు స్వామివారి పుష్పరథోత్సవం కోలాటం మధ్య ఊరేగింపు, అనంతరం అన్నదాన కార్యక్రమము నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లోని శ్రీమురళీ కృష్ణాలయంలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, శ్రీ మురళీ కృష్ణాలయం చైర్మన్ ఎలగందుల రామచంద్రం, ఆలయ సభ్యులు ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రాములు, అంతునూరి శివకుమార్, అత్తెల్లి లక్ష్మయ్య, శ్రీనివాస్, ఉప్పల మధుసూదన్, కాశినాథ్, అంతునూరి వినోద, అత్తెల్లి పద్మ, బాలమణి, పద్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

**మల్లన్నస్వామి సన్నిధిలో...**



శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, ఆగస్టు 26, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో బాలాజీ ప్రతి ఏటా జరిగే కృష్ణాష్టమి వేడుకలు ఒగ్గు పూజారులచే పెద్ద పట్నం వేసి ఒగ్గు పూజారులు వేషధారణతో కృష్ణుని గోపికలతో గ్రామంలోని పురవీధులగుండా ఊరేగింపు నిర్వహించిన అనంతరం స్వామివారికి పెద్ద పట్నం పంచరంగులతో గంగిరేగుచెట్టు వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఏఈఓ బుద్ది శ్రీనివాస్, ఆలయ ఒగ్గు పూజారులు, అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.

**అల్లాదుర్గంలో...**



ముప్పారం అంగన్‌వాడిలో కృష్ణుడి, గోపికల వేషాధారణలో చిన్నారులు

**అల్లాదుర్గం, ఆగస్టు 26, ప్రభాతవార్త:** మండంలో సోమవారం శ్రీ గోకులాష్టమి వేడుకలను భక్తులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని ముప్పారం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులు చిన్ని కృష్ణుడు, రాధ, సత్యభామ వేషాలు ధరించి ఉత్సవాల్లో ఆనందోత్సవాలతో పాల్గొన్నారు. చిన్నారుల వేషాలను గ్రామస్థులు తిలకించి సంబర పడ్డారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం యువత కేరింత మధ్య సందడిగా సాగింది.

**చిప్పల్‌తుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో...**

**నర్సాపూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** మండలపరిధిలోని చిప్పల్‌తుర్తి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమీ పర్వదినాన్ని పురస్కరించుకొని కృష్ణాష్టమీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో పాఠశాల చిన్నారులు శ్రీ కృష్ణుడి, గోపిక ల వేషాధారణలతో నృత్యాలు చేశారు.అనంతరం ఉట్టి కొట్టడం వంటి ఆటలు పాటలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ చిన్నారుల ఆట పాటలు,నృత్యాలు అందరిని ఎంతగానో అలరించాయి. చిప్పల్‌తుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులు కృష్ణాష్టమీవేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, మోహన్‌రావు, కవిత, విద్యార్థులు, గ్రామస్తులు. తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాష్టమీ వేడుకల్లో శ్రీకృష్ణుడి, గోపికల వేషాధారణలతో చిన్నారులు



చెరువు భూమిలో నిర్మించిన ప్రహరీని చూపుతున్న గ్రామస్తులు

## చెరువును ఆక్రమిస్తూ ప్రహరీ నిర్మాణం
## అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల ఆందోళన

**ములుగు, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం చెరువుల ఆక్రమణను అరికట్టడానికి హైడ్రా అనే అథారిటీని ఏర్పాటుచేసి అక్రమార్కుల భరతం పడుతుంటే మరోవైపు సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండ తిమ్మాపూర్ గ్రామంలో మాత్రం యదేశ్చగా చెరువును కబ్జా చేస్తున్న వైనం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బండతిమ్మాపూర్ గ్రామ శివారులో ఉన్న పాలసముద్రం చెరువు భూమిని ఓ ప్రైవేట్‌కంపెనీకి చెందిన వ్యక్తులు ఆక్రమించి రాత్రికి రాత్రి ప్రహరీ గోడను నిర్మించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, యువకులు మంగళవారం చెరువు భూమిలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను తొలగించాలని ఆందోళన చేపట్టారు. కంపెనీ నిర్వాహకులపై నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ చెరువు భూమిలో అక్రమ కట్టడాలను అరికట్టి చెరువును కాపాడాలని, అదేవిధంగా ఈ నిర్మాణాలకు పాల్పడ్డ వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ ఏఈ అస్సాంను వివరణ కోరగా పాల సముద్రం చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనులను ఆపాలని సంబంధిత కంపెనీ యజమానికి చెప్పడం జరిగిందని తెలిపారు. అట్టి నిర్మాణ పనులు ఆపకుంటే చట్టపరమైన చర్యలు తీసుకొని ఇదివరకు చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తామని వివరణ ఇచ్చారు.

## పద్మశాలి కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి
### -సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్



రాజ్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** నూతనంగా తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన రాజ్‌కుమార్‌కి పెద్దఎత్తున బీరంగూడ పద్మశాలి భవన్‌లో సన్మానం జరిగింది. పద్మశాలి సంఘం పట్టణం, మండలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. పద్మశాలి కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన గౌరవ అధ్యక్షులు అడెల్లి రవీందర్, కొకలా శ్రీనివాస్, మకాం మల్లేష్, సంఘం అధ్యక్షులు వనం యాదగిరి, గొప్ప దుర్గయ్య, మహేందర్, ఎల్లప్ప, అరిగె జ్ఞానేశ్వర్, చెన్న మోహన్, నర్సయ్య, వెంకట్ నారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మాలల శ్మశానవాటికలో మురికి కాలువను నిర్మించండి



మాలల స్మశాన వాటికలో నిండిన మురికి నీరు దృశ్యం

**నర్సాపూర్, ఆగస్టు 27. ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులోగల మాలల శ్మశానవాటికలో మురికి కాలువను నిర్మించాలని మన్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌కు, కౌన్సిలర్ లక్ష్మినాగేశ్‌లకు మాల సంఘం నాయకులు వినతి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్మశానవాటికకు సమీపంలోనున్న వివిధకాలనీలోని మురికినీరంతా శ్మశాన వాటికలోకి ప్రవేశిస్తుందన్నారు. దీంతో శ్మశానవాటికకు వెళ్లాలంటేనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. అంతేగాక అంత్యక్రియలు నిర్వహించాలంటే ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్ , అధికారులు స్పందించి మాలల స్మశాన వాటికలో మురికి నీరు నిలువ కుండా చర్యలు తీసుకోవాలని అదేవిదంగా మురికి కాలువను కూడ నిర్మించాలని వారు కోరారు..

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు పట్ల హర్షం



మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్

**గజ్వేల్, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** రాజకీయ ప్రేరేపితమైన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేయడం పట్ల గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశ సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడం పట్ల న్యాయ వ్యవస్థలపై నమ్మకం వచ్చిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలపై రాజకీయ కక్ష సాధించేందుకు ఈడి, సిబిఐలాంటి సంస్థలను ఉసిగొలిపి తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. ఎన్ని కుట్రలు ప్రయోగించినా పోరాటాన్ని కొనసాగించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. కవితను అరెస్ట్ చేసి ఐదు నెలల పాటు జైలులో ఉంచినా కెసిఆర్ వెనకడుగు వేయలేదని, న్యాయ వ్యవస్థలపై నమ్మకంతో న్యాయ పోరాటం సాగించడం వల్ల సుప్రీంకోర్టు ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేసిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ పోరాట పునాధులమీద పుట్టిన పార్టీ అని, ఎన్ని ఇబ్బందులు, కుట్రలు ప్రయోగించినా ధైర్యంగా ఎదుర్కొని కొట్లాడే దమ్ము ధైర్యం బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలన్నీ అమలు చేసేదాకా పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్‌గౌడ్, అహ్మద్, శివకుమార్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**కొమురవెల్లి, ఆగస్టు 27, ప్రభాతవార్త:** చేర్యాలకు చెందిన తుంగ రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబీకులను జనగామ డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కొమ్ము రవి, కామెడీ జీవన్‌రెడ్డి, పుర్మ అగంరెడ్డి, మెరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**సిర్గాపూర్, ఆగస్టు 27,ప్రభాతవార్త:** మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని వాసర్ గ్రామంలో యండి షాదుల్ నివాసం వెనకాల పేకాట ఆడుతున్న 7 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం... యండి షాదుల్ నివాసం వెనర జూదం ఆడుతున్నట్లు తెలుసుకున్న ఎస్సై సిబ్బంది తుకారాం, లక్ష్మికాంత్, రవి, సర్దార్‌తో కలిసి దాడి చేయగా జూదం ఆడుతున్న 7గురిని (జాదవ్ తిరుపతి, మ్యాత్రే వైజనాథ్, రాథోడ్ కిషన్, జాదవ్‌మారుతి, రాథోడ్‌కిషన్, షిండేసునీల్, ఎండి షార్దుల్‌లను అదుపులోకి తీసుకుని రూ.26,850, 5 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. జూదమాడిన వారికి కోర్టులో ప్రవేశ పెట్టామన్నారు.

# కబ్జాకు గురైన పాండవుల చెరువును కాపాడాలి

### బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్



మాట్లాడుతున్న మనోహర్‌యాదవ్

**గజ్వేల్, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో చెరువుల కబ్జాపై దూకుడు పెంచారని, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో చెరువుల పునరుద్దరణకు పూనుకోవాలని బిజెపి గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లను చదును చేసి చెరువుల విస్తీర్ణం సగానికి పైగా తగ్గించినా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కలెక్టర్ ద్వారా ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రాంతంలోనే పెద్ద చెరువు అయిన పాండవుల చెరువు సుమారు 104 ఎకరాల విస్తీర్ణంలో ఉంటే ప్రస్తుతం 49 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని, 50కి పైగా ఎకరాలను కబ్జా చేశారన్నారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లను మట్టితో చదును చేసి వెంచర్లు, ప్లాట్లు చేశారన్నారు. చేపల పెంపకంతో మత్స్యకారులకు ఉపాధి కల్పించిన చెరువు రోజు రోజుకు కబ్జాకు గురవుతుంటే మత్స్యకారుల జీవన పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ పాలకవర్గం రూ.6 కోట్లతో పాండవుల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పినా నీరు నిల్వ ఉంచేందుకు చెరువు లేకుండాపోయిందని, మున్సిపల్ పాలకవర్గం సంబంధిత అధికారులతో చర్యలు చేపట్టాలని, పాండవుల చెరువును పునరుద్దరించి కబ్జా నుండి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రాంతంలో ఉన్న చెరువుల రక్షణకై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి అయిల మహేందర్, పట్టణ ఉపాధ్యక్షుడు నాయిని సందీప్, చెప్యాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సాయిబాబా

## హైడ్రాను రాజధానికే పరిమితం చేయవద్దు
### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

**ముషీరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** హైడ్రాను రాజధానికి మాత్రమే పరిమితం చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూములను కబ్జాల నుండి కాపాడాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా విజ్ఞప్తి చేశారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జా ప్రభుత్వ భూములలో సొంత భవనాలు నిర్మించుకుని ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తించిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవటం కోసం హైడ్రా కమిటీని ఏర్పాటుచేయటం హర్షనీయమని అన్నారు. ప్రజా ప్రయోజనాలను కాపాడే హైడ్రాను నామమాత్రపు సంస్థగా కాకుండా దానికి ఒక చట్టబద్ధత కల్పించాలని కోరారు. హైడ్రా అధికార పార్టీకి కొమ్ము కాయకుండా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, ప్రజల్లో ఎలాంటి అపోహలకు తావు లేకుండా హైడ్రాను ఒక నిర్మాణాత్మక సంస్థగా రూపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి
### బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందచేస్తున్న జర్నలిస్టులు

**ముషీరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అంశంపై సీఎం తో చర్చించి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులు సభ్యులుగా ఉన్న తమ సొసైటీకి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతి నిధులు మంత్రిని కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బొల్లం శ్రీనివాస్‌లు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను మంత్రికి వివరించారు. ఎన్నో ఏళ్లనుండి జర్నలిస్టులు ఇళ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కల్పించి, న్యాయం చేస్తుందనే ఆశతో జర్నలిస్టులు అందరూ ఎదురు చూస్తున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ఆనందం, సీతారామరాజు, వీరారెడ్డి, పి.నాగవాణి, వేముల పుష్పలత, డి.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## అండర్ 16 బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో విజేత మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు



బాస్కెట్ బాల్‌లో విజేతగా నిల్చిన మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు

**అల్వాల్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్‌లో జరిగిన ఐదవ రాష్ట్ర యువజన అండర్ 16బాస్కెట్ బాల్ బాలికల విభాగంలో విజేతగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు విజేతగా నిల్చింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి వికారాబాద్ జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో మేడ్చల్ మల్కాజ్‌గిరి 58,56 రెండు పాయింట్లతో విజయం సాధించింది. ఈ నెల 25,26తేదీలలో రెండు రోజులపాటు పోటీలు జరగగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ పోరులో ఇరు జట్లు నువ్వానేనా అన్నట్లుగా తలపడ్డాయి. ఆఖరి ఐదు నిమిషాల్లో జిల్లా జట్టు వ్యూహాత్మకంగాఆడి విజేతగా నిల్చింది. ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలలో వరుసగా రెండవ సారి జిల్లా జట్టు టైటిల్‌ను సాధించడం విశేషం. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్ సిరిగిరి, ఉపాధ్యక్షుడు జోర్దాన్ రవి, పరిశీలకుడు విశాల్, కోచ్ శ్రీధర్‌తో పాటు జట్టు సభ్యులను అభినందించారు. తెలంగాణా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నార్మన్ ఈశాక్ జిల్లా జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

## గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా సాగాలి: ఎసిపి

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 27 ప్రభాతవార్త**

గణేష్ చవితి ఉత్సవాలను భక్తిశ్రద్దలతో శాంతియుతంగా పూర్తిచేసి ఐక్యతను చాటాలని బాలానగర్ సహయ పోలీసు కమిషనర్ హనుమంతరావు సూచించారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ సమావేశపు హాలులో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ సమితి సమన్వయ సమావేశానికి వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ నాయకత్వంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసరావు, సిఐ గడ్డం మల్లేశ్, కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యుటీ కమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మ, కట్టా కుమార్‌లు ఉత్సవాలను నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సూచనలు, సలహాలను వివిధ విభాగాల అధికారులు అందజేశారు. జిహెచ్ఎంసి విద్యుత్ విభాగం, ట్రాఫిక్, ఫైర్ విభాగాల అధికారులతోపాటు మొత్తం 150 మంది గణేష్‌ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి

## చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం.. మహిళ రిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** పాతకక్షలతో ఓ చిన్నారిని కిడ్నాప్ చేసిన కేసును కాచిగూడ పోలీసులు కొన్ని గంటల్లోనే ఛేదించారు. మంగళవారం కాచిగూడ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి, అదనపు డీసీపీ జె.నర్సయ్య , కాచిగూడ డివిజన్ ఏసీపీ బి.రఘు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ బాలస్వామి మాట్లాడుతూ కామారెడ్డికి చెందిన తిరుపతి భార్య దాసరి మంజుల(29) వృత్తిరీత్యా బిక్షాటన చేస్తుంది. లచ్చ మమత దంపతుల సంవత్సరం 4 నెలల చిన్నారి శ్రీలక్ష్మి అమ్మమ్మ పార్వతమ్మతో కలిసి సోమవారం అర్ధరాత్రి కాచిగూడ రైల్వేస్టేషన్ బస్‌స్టాప్‌లో పడుకున్నారు. గతంలో జరిగిన పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని మంజుల ఆమె మర్ది మున్నా కలిసి చిన్నారి శ్రీలక్ష్మిని కిడ్నాప్ చేయడంతో అదేరోజు రాత్రి అమ్మమ్మ పార్వతమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా డబీర్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్లు తెలుసుకుని మంగళవారం చాకచక్యంగా పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. దాసరిమంజులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో అంబర్‌పేట డిఐ మల్లేశ్వరి, ఎస్ఐ సురేశ్‌కుమార్ ఉన్నారు.

## ఆటోలో బంగారు ఆభరణాలను మరిచిన మహిళ
### గంటల వ్యవధిలో అప్పగించిన పోలీసులు



బాధిత మహిళకు బంగారు ఆభరణాలను అప్పగిస్తున్న గౌరీనాయుడు

**సరూర్‌నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ఆటో దిగేసమయంలో 25 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును మరచిపోయిన ఓ మహిళకు మీర్‌పేట్ పోలీసుల చొరవతో సొత్తుదక్కింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లెలగూడ గాయత్రీ నగర్ నివాసి మడ్డి వనజ కుటుంబ సభ్యులతో కలిసి సరూర్‌నగర్ చెరువు కట్ట దిగువన ఉన్న శారదానగర్‌లోని ఓ వస్త్ర దుకాణానికి సోమవారం ఉదయం వచ్చింది. ఆ తర్వాత అక్కడే ఆటో ఎక్కి వారంతా ఇంటికి చేరుకున్నారు. అయితే ఆటో దిగిన తర్వాత మధ్యాహ్న సమయంలో వనజకు తన వెంట ఉన్న 25 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగు గుర్తుకు వచ్చి దానిని పోగొట్టుకున్నట్లు గ్రహించింది. ఈ మేరకు ఆమె మీర్‌పేట్ పిఎస్‌లో ఫిర్యాదు చేయగా డిఐ గౌరీ నాయుడు ఆధ్వర్యంలో రంగంలో దిగిన క్రైం పోలీసులు ఆటో ప్రయాణించిన మార్గంలో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆటోలో ఉన్న ఆభరణాల బ్యాగు కర్మన్‌ఘాట్ క్రాంతినగర్ గ్రౌండ్ ముందు రహదారిలో పడిపోగా వెనక వస్తున్న మరో ప్యాసింజర్ ఆటో డ్రైవర్ దానిని తీసుకున్నట్లు సిసి ఫుటేజీలో గమనించారు. దీంతో పోలీసులు కొన్ని గంటల్లోనే సదరు ఆటో డ్రైవర్ ఇంటిని ట్రేస్ చేసి అతని వద్ద నుండి బంగారు ఆభరణాల బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధిత మహిళకు సమాచారం ఇచ్చి మీర్‌పేట్ పిఎస్‌లో దానిని అప్పగించారు. ఈ మేరకు ఆమె పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను గుర్తించి వాటిని అప్పగించిన మీర్‌పేట్ డిఐ గౌరీ నాయుడు, క్రైం పార్టీ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

## త్యాగరాయ గానసభలో ‘ప్రతిభకు పట్టం-గౌరవ సన్మానాలు’

**సైఫాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ఒక న్యాయవాది నివాసంలో పని మనిషిగా చేరిన మహిళ ఇంటికే కన్నం వేసి ఐదున్నర తులాల బంగారు అభరణాలు, కొంత నగదు దోపిడీ చేసి కటకటాలపాలైన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నారాయణగూడ పోలీస్ స్టేషన్ సిఐ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ కాచిగూడకు చెందిన చాకలి ఇందిర (42) అనే మహిళ నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాగ్‌లింగపల్లిలోని న్యాయవాది విపిన్ ఇంట్లో పనిమనిషిగా కొన్నాళ్ల క్రితం చేరిందని, ఆమె సక్రమంగా పనికి వస్తూనే ఇంట్లో 500, 2వేలు, 3వేలు రూపాయలు నగదును దొంగించుకుపోతున్నదని చెప్పారు. ఈ విషయాన్ని గమనించిన న్యాయవాది ఆమెను పనిలోంచి తీసివేయడం జరిందని సిఐ తెలిపారు. కాగా ఇటీవల న్యాయవాది అమమ్మ బీరువాలో ఉన్న 3 తులాల బంగారు మంగళ సూత్రం, రెండు తులాల బంగారు గోలుసు, అర తులం పుస్తెలు మాయమైనాయని గమనించి నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. సుల్తాన్ బజార్ డివిజన్ ఎసిపి కె.శంకర్ ఆధ్వర్యంలో నారాయణగూడ పోలీసులు విచారణ ప్రారంభించి చాకలి ఇందిరపై నిఘా పెట్టారని, ఆమె బంగారు అభరణాలను తాకట్టు పెట్టడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని ఆయన తెలిపారు. పోలీసుల విచారణలో ఆమె దొంగతనం చేసినట్లు అంగీకరించడంతో పోలీసులు ఆమె వద్ద నుంచి ఐదున్నర తులాల భంగారు అభరణాలను స్వాదీనం చేసుకుని రిమాండ్‌కు తరలించడం జరిగిందని సిఐ వివరించారు. ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్ డిఎస్ఐ జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జి.వెంకటేష్‌ను ఎసిపి శంకర్ అభినందించారు.




మాట్లాడుతున్న సిఐ చంద్రశేఖర్

## ఉపాధ్యాయుల సంక్షేమానికి పిఆర్‌టియు కృషి
### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

**మర్కుక్, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** ఉపాధ్యాయుల సంక్షేమానికి పిఆర్‌టియు సంఘం ఎల్లవేళలా కృషి చేస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. మర్కుక్ కెజిబివిలో గణిత ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన గీతాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిఆర్‌టియు సంక్షేమ నిధి నుండి ఉపాధ్యాయురాలు గీతాదేవి కుటుంబసభ్యులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పిఆర్‌టియు పనిచేస్తుందని అన్నారు. ఉపాధ్యాయులకు పిఆర్‌టియు అండగా ఉంటుందని, ఎవరికి ఏ సమస్య వచ్చినా ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌టియు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, మర్కుక్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, తుమ్మ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, రజిత, కెజిబివి ప్రత్యేకాధికారిణి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు స్వాతి, శ్రీనివాస్, మోతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీకృష్ణుని పుష్పరథోత్సవం



పుష్పరథోత్సవం ముందు కోలాటం ఆడుతున్న భక్తులు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా గజ్వేల్ పట్టణంలోని శ్రీ మురళీ కృష్ణాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన పుష్పరథోత్సవంపై శ్రీకృష్ణున్ని అధీష్టింపజేసి ఆలయం వద్ద నుండి ప్రధాన రహదారి మీదుగా ఇందిరా పార్కు చౌరస్తా నుండి ఆలయం వరకు ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. పుష్పరథోత్సవంముందు మహిళల కోలాటం, ఉట్టి కొట్టే కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. పుష్పరథోత్సవ ఊరేగింపులో శ్రీకృష్ణున్ని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఆలయ కమిటీ చైర్మన్ ఎలగందుల రామచంద్రం, సభ్యులు దూబకుంట మైత్రాములు, ఉప్పల వెంకటేశం, అత్తెల్లి లక్ష్మయ్య, అంతనూరి శివకుమార్, ఉప్పల మధు, కాశీనాథ్, పద్మ, వినోద, బాలమణి, శారద తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే భవిష్యత్తు బంగారుమయం : ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

**అల్లాదుర్గం, ఆగస్టు 27, ప్రభాతవార్త:** విద్యార్థినులు విద్యపై దృష్టి సారించి క్రమ శిక్షణతో విద్యను అందుకుంటే భవిష్యత్తు బంగారు మయం కావడ తధ్యమని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కళాబృంధం అల్లాదుర్గ సర్కిల్ పరిధిలోని కేజీవీబీ విద్యార్థినులకు మంగళవార అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కళా బృందం సభ్యులు విద్యార్థినులకు భవిష్యతుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్దతులపై కళాకారులు పాటలతో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, అత్యాశకుపోకుండా జాగ్రత్తగా ఉండాలని, లక్కీడ్రా అంటూ మోసం చేస్తారని, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని, అపరిచితుల ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. అపరిచితులకు తమ వివరాలు, బ్యాంక్‌వివరాలు, ఓటిపిలు ఎలాంటి పరిస్తితుల్లోనే పంచుకోవద్దన వివరంచారు. సైబర్ నేరాలకు గురియితే వెంటనే 1930కి లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712657888కి లేదా సంబంధిత పోలీసు ఠాణాకు సమాచారం అందించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు పాల్పడితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు కాల్ చేయాలన్నారు. క్రమ శిక్షణతో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పోలీసు కళాబృందం సభ్యులు సురేందర్, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సిఐ

**కొమురవెల్లి(చేర్యాల)ఆగస్టు 27, ప్రభాతవార్త:** సైబర్ నేరస్తులతో జాగ్రత్తగా ఉండాలని..రుణమాఫీ విషయంలో ఏలాంటి మెసేజులు, ఫైల్స్ ఓపెన్ చేయొద్దని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. చేర్యాల పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంకు వద్ద రుణమాఫీ, బ్యాంకు పని మీద వచ్చిన రైతులు, ప్రజలు, వ్యాపారులకు మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో ఏదైనా సమస్య ఉంటే నేరుగా బ్యాంకుకు వెళ్లి బ్యాంకు అధికారులతో మాట్లాడాలన్నార. రుణామాఫీ నేపథ్యంలో కొందరు సైబర్ నేరాగాళ్ల ఎదో బ్యాంకు పేరిట వాట్సాప్‌న ప్రొఫైల్ బ్యాంకు పేరు పిక్చర్ బ్యాంకు లోగోతో వాట్సాప్ యాప్‌లో ఎపికె ఫైల్స్ పంపిస్తున్నారని తెలిపారు. ఎపికె ఫైల్స్ వస్తే ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా సైబర్ నేరాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను

## మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

**పంజగుట్ట, ఆగస్టు 27 (ప్రభాతవార్త):**

ఇళ్ళ దగ్గర నీళ్ళు వాడుకునే విషయంలో చిన్న సమస్య ఏర్పడగా దంపతులను, అడ్డు వచ్చిన మహిళను ఎక్కడపడితే అక్కడ తాకుతూ అసభ్యంగా ప్రవర్తించాడని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల ప్రకారం జూబ్లీహిల్స్ రోడ్డునంబర్ 10 లోఎన్వీ రమణబాబు నివశిస్తుంటాడు. వీరి పక్కనే రవికాంత్ నివాసముంటున్నాడు. వీరిరువురు నీటి అవసరాల కోసం ఒకే సంప్‌ను వాడుకుంటుంటారు, ఈ నేపథ్యంలో ఇటీవల రంగనాథ్ ఇంటికి తల్లిదండ్రులు వచ్చినప్పటి నుండినీరు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాడు. నీరు ఇవ్వకపోగా తరచుగా వీరిపై నానా మాటలు అంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. గత వారం క్రితం ఇంకో వ్యక్తితో ఫోన్ చేయించి మాట్లాడదామని రమ్మన్నాడు. తాను అనారోగ్యంతో ఉన్నాని చెప్పినా వినకుండా కబురు చేస్తుండడంతో రమణబాబు అక్కడకు వెళ్ళాడు. అక్కడకు వెళ్ళిన వ్యక్తితో అసభ్యకరంగా మాట్లాడి ఇంట్లో ఉన్న భార్యపై కూడా చెప్పుతో దాడికి ప్రయత్నించాడు. దీంతో రమణబాబు కిందపడిపోయాడు. అక్కడే ఉన్న మరో మహిళ ఈ గొడవ సర్దిచెప్పడానికి ప్రయత్నించగా ఆమెపై కూఆ దాడికి దిగి విచక్షణారహితంగా మాట్లాడారు. ఆమె ఒంటిపై అసభ్యంగా చేతులు వేస్తూ భయకంపితులు చేయడంతో ఆమె అక్కడ నుండి పారిపోయింది. తర్వాత రమణబాబు సాయంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు అరుణ్‌రాజ్ శేరికార్

## రుణమాఫీ అని రైతులను దగా చేసిన కాంగ్రెస్

### -బిజెపి నేత అరుణ్‌రాజ్ శేరికార్

**సిర్గాపూర్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గంటకో మాట చెబుతూ రైతులను దగా చేస్తోందని భారతీయ జనతా పార్టీ నాయకులు అరుణ్‌రాజ్ శేరికార్ విమర్శించారు. మంగళవారం సిర్గాపూర్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక మాట మీద నిలవాలని అరుణ్‌రాజ్ శేరికార్ ప్రభుత్వానికి సూచించారు. ఎన్నికల సందర్భంగా బ్యాంకులకు వెళ్లి రుణాలు తెచ్చుకోండి నేనొచ్చాక రుణాలన్నీ మాఫీ చేస్తానని రైతులను ప్రోత్సాహించి రుణాలు తీసుకునేలా చేసిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతులందరి రుణాలను మాఫీ చేయకుండా బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిప్పుతు రైతులు అయోమయానికి గురయ్యేలా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో ఎన్ కన్వెన్షన్ ఒకటి పాడేసి ప్రజలను తప్పుదోవలో నడిచేలా చేస్తున్నారని విమర్శించారు. అక్రమంగా కట్టిన అసదుద్దీన్ ఓవైసి కట్టడాలను కూల్చాలని హితువు పలికారు.

## నాయీ బ్రాహ్మణ సంఘం మండల కార్యవర్గం



గంగారాంకు నియామకపత్రాలు అందచేస్తున్న దృశ్యం

**చౌటకూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త:** నాయీ బ్రాహ్మణుల సంఘం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ మండల అధ్యక్షుడిగా మహేష్(సుల్తాన్‌పూర్), మండల అధ్యక్షుడిగా బోనొల్ల గంగార (చౌటకూరు), ఉపాధ్యాక్షుడిగా ఎం ప్రశాంత్ (కోర్పోల్), ప్రధాన కార్యదర్శిగా ఎం మల్లేశం (శివ్వంపేట), కోశాధికారిగా ఎం రమేష్ (శివ్వంపేట), ఉపకార్యదర్శిగా ఎం రంగయ్య(అంగడిపేట్), ఉప కోశాధికారి గా ఎం.కృష్ణ(గంగోజిపేట్), సలహాదారులుగా ఎం వెంకటేశం, ఎర్రోల్ల చెన్నయ్య, ఎం శంకరయ్య, బి.నేగేష్, ఆర్.సత్యనారాయణలను ఎన్నుకున్నారు. మండల సంఘం కమిటి బాధ్యులుగా ఎన్నికైనవారికి నియామక పత్రాలు అందచేశారు.

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్.. బిఆర్ఎస్ శ్రేణుల సంబరాలు



జహీరాబాద్‌లో సంబరాలు చేసుకుంటున్న బిఆర్ఎస్ శ్రేణులు

**జహీరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో బిఆర్ఎస్ శ్రేణులు మంగళవారం పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని భవాని మందిర్ ప్రధాన కూడలిలో బిఆర్ఎస్ నాయకులు, జాగృతి నాయకులు మహిళలు టపాసులు కాలుస్తూ, స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నామ రవి కిరణ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, భారత జాగృతి అధ్యక్షురాలు అనసూయమ్మ, మాజీ అధ్యక్షులు మహమ్మద్ యాకూబ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు మంజుల, మాజీ కౌన్సిలర్లు అబ్దుల్లా, బండి రంగమ్మ, మహమ్మద్ అలీ, మాజీ సర్పంచ్ రవి కిరణ్, టిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు రాకేష్, తులసి గుప్తా, పట్టణ ఎస్సీ సెల్ అధ్యఓఉలు శివప్ప, పద్మజ, నాయకులు సత్యం ముదిరాజ్, ఎస్ రెడ్డి, గణేష్, మధు, చంద్రయ్య, జాకీర్, అలీ, వహీద్, అసం, నిజాం, ఓంకార్, భీమ్‌రావు రాథోడ్, కనుకుట్ల శ్రీకార్, శివకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

**కంగ్టిలో...**

**కంగ్టి, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కాం కుట్ర కోణంతో పెట్టిన కేసులో దాదాపుగా 166 రోజులపాటు తీహార్ జైల్లో గడిపారు. రాజకీయ ప్రేరణతో పెట్టిన కేసులో ఈరోజు సుప్రీంకోర్టు ఎమ్మెల్సీ కవితకు బెయిల్ఇచ్చిన సందర్భంగా కంగ్టిలో మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు బాణసంచాలు కాలుస్తూ మిఠాయిలు పంచుతూ సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీసీ ఆంజనేయులుసేట్, తాజా మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ కృష్ణముదిరాజ్, పండరినాథ్‌రావు, సత్యనారాయణ, సాయిలు, దత్తురాయ్ పాటిల్, మాజీ ఎంపీటీసీలు అంబాజీపాటిల్, సాయిలు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్ పట్టణంలో...**



పట్టణంలో సంబరాలు చేసుకున్న బిఆర్ఎస్ నేతలు

**నారాయణఖేడ్ టౌన్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కవితకు సుప్రిం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో పట్టణంలో బిఆర్ఎస్ నేతలు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. కవితకు బెయిల్ రావడం పట్ల బిఆర్ఎస్ నాయకులు ఆనందం, హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని రాజీవ్ కూడలి వద్ద పటాకులు కాలుస్తూ మిఠాయిలు పంచుకుని సంబరాలను సంతోషంగా జరుపుకున్నారు. రాజకీయ కుట్రలతోనే కవితి 166 రోజులు తీహార్ జైల్‌లో గడపాల్సి వచ్చిందని విచారం వ్యక్తం చేశారు. ఆలస్యంగా ఆయిని న్యాయమే గెలించిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పురపాలిక మాజీ చైర్మన్ నజీబ్, మండల సర్పంచ్‌లు ఫోరం మాజీ అధ్యక్షులు జగదీధ్వరాచారి, మంల మాజీ కో-ఆప్షన్ సభ్యులు నగవాబ్, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు నగేష్, మాజీ ఎంపిటిసి సభ్యులు ముజమ్మిల్, అంబాదాస్, లయక్, అంజాగౌడ్, గోపాల్, ఉబేద్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ కవితకు బెయిల్ హర్షణీయం : మాజీ జడ్‌పిటిసి

మునిపల్లి, ఆగస్టు 27, ప్రభాతవార్త: రాజకీయ కక్షలతో ఎమ్మెల్సీ కవితను జైలు పాలు చేసిన రాజకీయ పార్టీల నాయకులకు సుప్రిం కోర్టు ఇచ్చిన బెయిల్ చెంపపెట్టులాంటిదని మాజీ జడ్పీటిసి సభ్యురాలు పైతర మీనాక్షి సాయికుమార్ అన్నారు. కవితపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపలేక పోయారని దర్యాప్తు సంస్థలపై మండిపడ్డారు. సుప్రిం కోర్టు తీర్పుపై దేశ ప్రజలకు మరో మారు విశ్వాసం నిరూపితమయిందన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు అసత్య ఆరోపణలు మాని చిత్తశుద్ధితో మెలగాలని హితువు పలికారు.

### విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేత

**శివ్వంపేట,ఆగస్టు 27 (ప్రభాతవార్త) :** శివ్వంపేట మండలం గూడురు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు స్కూల్ బ్యాగులు, ఫ్యాట్స్, బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులకు బ్యాగులు, ఫ్యాట్స్ బుక్స్ పంపిణి చేసిన అక్షయ ఫౌడేషన్ సభ్యులకు ఉపాద్యయులు ప్రత్యేక కృతజ్ఞలు తెలిమజేశారు. ఈ కార్యక్రమాంలో అక్షయ ఫౌడేషన్ సభ్యులు సురేష్ యాదవ్,కుమ్మరి మహేష్,బొట్టు ప్రవిణ్, భాను, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వెంటనే కుల జనగణన చేపట్టాలి

### సగర సంఘం జిల్లా అధ్యక్షుడు సందిల సాయిలు సగర

**టేక్మాల్, ఆగస్టు 27, ప్రభాతవార్త ః** రాష్ట్రంలో కుల జనగణన కార్యక్రమం ప్రభుత్వం వెంటనే చేపట్టాలని, ఇక సగర కుల జనగణన తామే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని సగర సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు సందిల సాయిలు సగర అన్నారు. మంగళవారం టేక్మాల్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో సగరకుల జనగణన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర నాయకత్వంలో తాము 32 అంశాలతో కూడిన సమగ్ర సమాచారంతో సగర కుల జనగణనను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. సమగ్ర కుల గణన చేపట్టాలని బీసీ సంఘాలుగా అనేక సంవత్సరాలుగా తాము డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు ముందుకు రావడం లేదని అన్నారు. ప్రభుత్వాలు,పాలకులపై తమకు నమ్మకం పోయిందని, ఇక తమ కులం యొక్క జనాభా లెక్కలు సమగ్ర సమాచారంతో తామే సేకరించి ప్రభుత్వం ముందు పెట్టబోతున్నామని ఆయన పేర్కొన్నారు. రాబోయే కొద్ది రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుల గణన పూర్తి చేసి నివేదికు రాష్ట్ర ప్రభుత్వం ముందు నివేదిస్తామని తెలిపారు. జనగణనతో పాటు తమ కులబాంధవులకు సభ్యత్వం ద్వారా రెండు లక్షల రూపాయల ప్రమాద భీమా పథకాన్ని రాష్ట్ర సంఘం పక్షాన అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సగర కులస్తులు ఈ జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేసి, సగరుల చైతన్యాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్నటువంటి సగరులతో సమగ్ర కుల గణన పూర్తిచేస్తామన్నారు. అంతకు ముందు జిల్లా కార్యవర్గంతో కలిసి గ్రామంలోని సగరులకు సభ్యత్వాన్ని అందించారు. ఎల్లంపల్లి గ్రామ సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి బుచ్చయ్య సగర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర సగర సంఘం సంయుక్త కార్యదర్శి మర్కు దత్తాత్రేయ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేష్ సగర, జిల్లా కోశాధికారి ద్యాప బాల్‌కిషన్ సగర, జిల్లా యువజన సంఘం కోశాధికారి ఉప్పరి సాయిలు సగర, గ్రామ సంఘం నాయకులు ఉప్పరి పండరి సగర, ఉప్పరి పెద్ద సాయిలు సగర, ఉప్పరి రమేష్ సగర, ఉప్పరి సాయిలు సగర, ఉప్పరి సాయిబాబా సగర, ఉప్పరి చిన్న సాయిలు సగర, ఉప్పరి శివకుమార్ సగరతో పాటు గ్రామ సగర సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సగరకుల జనగణనలో భాగంగా సభ్యత్వం అందిస్తున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



బ్యాంక్ మేనేజర్లతో సమావేశం అయిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## రైతు రుణమాఫీపై బ్యాంక్ మేనేజర్లతో ఎమ్మెల్యే సమావేశం

**నారాయణఖేడ్ టౌన్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రైతు రుణమాఫీ విషయంలో మంగళవారం క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా బ్యాంక్ మేనేజర్లతో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బ్యాంక్ మేనేజర్లకు పలు సూచనలు చేశారు. రుణ మాఫీ విషయమై చిన్ని చిన్న సమస్యలుఉన్నా అర్హులైన రైతు లకు రుణాలు మాఫీ అయ్యేలా చొరవ తీసుకువాలని, రైతులు అధైర్యపడ కుండా రుణమాఫీకి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకుల్లో బడారైతులు, నేతలకుకాకుండా సామాన్య రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతుల పరంగా తప్పిదాలు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు అవకాశం ఇచ్చి సమస్య పరిష్కారం అయ్యేలా చూసి రుణాలు మాఫీ అయ్యేలా తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి, ఆయా మండలాల తహసీల్దార్‌లు, ఎంపిడిఓలు, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులపై అవగాహన



వీడియో కాన్ఫరెన్స్ దృశ్యం

**రామాయంపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త :** రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా రైతులకు డిజిటల్ విధానం ద్వారా వివిధ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు గుర్చి మరియు ఎరువుల యాజమాన్యం పురుగు మందుల పిచికారి వంటి జాగ్రత్తలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తల చేత వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో కురిసినటువంటి వర్షాల ప్రభావం వల్ల వివిధ పంటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గూర్చి రైతులకు వివరించడం జరిగింది. తదుపరి రైతుల ద్వారా క్షేత్రస్థాయిలో వివిధ యాజమాన్య పద్దతులకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సాయికృష్ణ, రాజు, స్రవంతి మరియు రైతులు పాల్గొన్నారు.

## న్యాయం గెలించింది.. ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుంది

### మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకులు

**మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు27 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో గత ఐదు నెలలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్న నేపథ్యంలో సుంప్రీ కోర్టు వారిపై చేసి అభియోగాలను పరిశీలించి బెయిట్ మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఆధ్వర్యంలో బాణసంచాలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని, వారి చేసిన అభియోగాలు కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగమే అన్నారు. ఇకపై వారి కార్యాచరణ తెలంగాణ రాజకీయాలలో ఒక మార్పును తెస్తుందని, మహిళా నాయకురాలిపై చేస్తున్న ఆరోపణలు, అభియోగాలు విరమించుకొని సురక్షిత భారత్ వైపు వారు అడుగులు వేస్తే బాగుంటుందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, జయరాజ్, సులోచన ప్రభురెడ్డి, ఆర్‌కె. శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు అంకం చంద్రకళ, సోహెల్, మహిళా నాయకురాలు రాధా, నాయకులు కపాపురం మధు, జుబేర్ అహ్మద్, నియాజ్ ఫాజిల్, మలిశెట్టి రవి, కసాపురం కిరణ్, జగదీశ్వర్, మల్లూరి, మహేష్ యాదవ్, గోల్కొండ చాన్, కొలుపుల రాజు, అనూప్, అమెర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పంటల గురించి వివరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

## రైతువేదికను సందర్శించిన మోడల్ స్కూల్ విద్యార్థులు

**రామాయంపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త :** మోడల్ స్కూల్ విద్యార్థులు మంగళవారం రైతువేదిక సందర్శించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వ్యవసాయ శాఖలో రైతుల కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను రైతుబంధు, బీమా, పంటల నమోదు, పిఎం కిసాన్‌నిధి, రుణమాఫీ వంటి పథకాలతోపాటుగా వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు చేస్తున్న వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు గూర్చి విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయంపై పరిజ్ఞానాన్ని పెంచుకొని ఆధునిక సాంకేతిక పద్ధతులను నేర్చుకొని వ్యవసాయం చేస్తున్నటువంటి తమ తల్లిదండ్రులకు తోడ్పడాలని ఆధునిక సాంకేతిక ఉపయోగించుకోవడం ద్వారా రైతుల శ్రమ తగ్గడంతోపాటు తక్కువకాలంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తూ అధిక ఆదాయం పొందే అవకాశం ఉన్నందున విద్యావంతులైనటువంటి విద్యార్థులు నూతన సాంకేతిక పద్ధతులు నేర్చుకొని వ్యవసాయం చేస్తున్నటువంటి తమ తల్లిదండ్రులకు తోడ్పడాలని సూచించారు. ఈ సందర్భంగా దృశ్యమాధ్యమం విధానం ద్వారా శాస్త్రవేత్తల చేత రైతులకు అవగాహన చేస్తున్నటువంటి రైతు నేస్తం కార్యక్రమం గూర్చి విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో పాటుగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయినీలు సోనియా, సునీత మరియు పాఠశాలకు చెందిన 36 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**మునిపల్లి, ఆగస్టు 27, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురైన మండల కేంద్రానికి చెందిన మలేగామ శరణప్ప మెరుగైన చికిత్స అందుకునేందుకు రూ. 45 వేల సిఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం కాంగ్రెస్ నేత ఆర్ నరేందర్‌గౌడ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహ సూచనలమేరకు అందచేశారు. సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందుకున్న శరణప్ప కాంగ్రెస్ ప్రభుత్వానికి, అందుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటి అధ్యక్షులు రాజు పాటిల్, నాయకులు పరమేశ్వర్‌రావు, కోనాపురం సంగమేశ్వర్, వంశీ, రాకేష్, శివ పాటిల్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి : ఆర్డీవో

**నర్సాపూర్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** బిఎల్‌వోలు, సూపర్‌వైజర్‌లు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నర్సాపూర్ మండలానికి సంబంధించిన బిఎల్‌వో, సూపర్ వైజర్‌లకు ఇంటింటి సర్వేపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మండల తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొనగా మాస్టర్స్ ట్రైనర్స్ లక్ష్మీనారాయణ, ప్రసన్న కుమార్ శ్రీనివాస్ బిఎల్‌వో, సూపర్‌వైజర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్స్ ట్రైనర్స్ లక్ష్మీనారాయణ, ప్రసన్నకుమార్, శ్రీనివాస్‌లు ఓటరు నమోదు, చేయడం తొలిగించడం, నకిలీ ఓటర్లుఉంటే తీసివేయడం, ఓటర్లు ఏవిధంగా నమోదు చేసుకోవాల్లో బిఎల్‌వో, సూపర్ వైజర్ లకు అవగాహన కల్పించడం జరిగివది.ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బిఎల్‌వో, సూపర్ వైజర్‌లు ఇంటింటి సర్వేను పకడ్బందిగా నిర్వహించాలని సూచించారు.ఈ శిక్షనలో ట్రైనరస్స తెలియజేసిన ప్రకారంగా ఓటరు నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబబంది నాగరాజు, బిఎల్‌వోలు, సూపర్ వైజర్ లు సిబ్బంది ఆపల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

# గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్

**రామాయంపేట మున్సిపాలిటీ, ఆగస్టు 27, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో కాలేజీ విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సరైన సమయానికి బస్సులు రాక క్లాసులు మిస్ అవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్షులు సంతోష్ అన్నారు. మంగళవారం రామాయంపేట మండల ఎస్ఎఫ్ఐ కమిటీ పక్షాన స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయంపేట మండలంలో పలు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు హాస్టల్ వసతి లేక పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బాయ్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బాలికల హాస్టల్ పూర్తిగా శిథిల వ్యవస్థకు చేరడంతో చిన్నపాటి వర్షానికి రూములోకి నీరు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాల సమయానికి బస్సులు రాక పోవడం మారుమూల గ్రామాల్లోకి బస్సులు వెళ్లక పోవడం వల్ల చాలామంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున స్థానిక అధికారులు స్పందించి రామాయంపేట మండల కేంద్రంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. కేజీబీవీ హాస్టల్లో విద్యార్థులకు హెల్త్‌క్యాంప్ ఏర్పాటుచేయాలని ఆయన అన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్, మండల ఉపాధ్యక్షుడు సంజీవ్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్దిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేద వారిని, రైతులను కాంగెస్ చేసిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ అశోక్‌చక్రవర్తి, తహసీల్దార్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

**నాగల్‌గిద్దలో...**

**నాగల్‌గిద్ద, ఆగస్టు 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం ఆయా గ్రామాల చెందిన 36 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అందచేశారు. మండల పరిధిలోని కరస్‌గుత్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి ఎమ్మెల్యే డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి మంజూరైన అంబులెన్స్‌ను ఎమ్మెల్యే జండా ఊపి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి, కాంగ్రెష్ పార్టీ మండల అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, తహసీల్దార్ రమాదేవి, నాయకులు గుండేరావు పాటిల్, పండరి నాథ్‌రావు, సచిన్ పాటిల్, అనిల్ పాటిల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### అంబేద్కర్ విగ్రహావిష్కరణకు విరాళం అందజేత

**శివ్వంపేట, ఆగస్టు 27(ప్రభాతవార్త) :** మండలంలోని పాంబండ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి సెప్టెంబర్ 1న జరిగే కార్యక్రమానికి రూ. 30 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాం రెడ్డికి అంబేద్కర్ యూత్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తలరి శివులు,గుండ వేణు,కుల్ల వెంకటేష్, రాములు, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**శివ్వంపేట, ఆగస్టు 27 (ప్రభాతవార్త) :** మండలంలోని పిలుట్ల గ్రామనికి చెందిన మోనగారి మల్లేష్ ఆకస్మితంగా మరణించినందున విషయం తెలుసుకున్నా పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటు సహయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. కార్యక్రమాంలో పిఎసిఎస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సంఘ సేవకులు బండారి గంగాధర్,కాంగ్రెస్ గ్రామకమిటి అధ్యక్షులు రాఘవరెడ్డి,నాయకులు బెస్త కిష్టయ్య, కుమ్మరి నాగరాజు, పెద్దపులి సతీష్, గుర్రాల బాతేష్, బుర్ర వినయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**మనూర్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** మహిళల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మనూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయాగ్రామాలకు చెందిన లబ్దిదారులకు ఎమ్మెల్యే కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ అశోకచక్రవర్తి, తహసీల్దార్ వెంకటస్వామి, మాజీ సర్పంచ్ దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాజుసిద్దారెడ్డి, అశోక్‌రావు, శివాజీరావు, బిరదర్ దత్తు, సిహెచ్ నర్సింలు, జూనియర్‌అసిస్టెంట్ ఖాజా,లబ్దిదారులు పాల్గొన్నారు.

### నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

**సిర్గాపూర్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీనుంచి సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి నాగారం శ్రీనివాస్, ఎంఈఓ శంకర్‌లు తెలిపారు. ఈ నెల 28న బాలికలకు, ఈ నెల 29న బాలురకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు, గురుకుల పాఠశాలలకు చెందిన బాల బాలికలు పోటీల్లో పాల్గొనవచ్చున్నారు. క్రీడా పోటీలను తిలకించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎస్ఐ వెంకట్‌రెడ్డిలు హాజరుకానున్నారని నాగారం శ్రీనివాస్, శంకర్‌లు వివరించారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



మునిపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ దశరథ్

**మునిపల్లి, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఎఫ్‌ఎల్ఎన్, ఎన్ఎఎస్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మునిపల్లిలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ దశరథ్ పరిశీలించారు. ఉదయం 9 గంటలకు ఎంఈఓ పాఠశాలకు చేరుకుని ప్రార్థనలో పాల్గొన్నారు. పాఠశాలలో రికార్డులను, హాజరు పట్టికలను పరిశీలించారు. నవంబరు నెలలో ఎన్ఎఎస్ పరీక్షలు ఉంటాయని, అందుకు విద్యార్థులకు పూర్తి స్థాయిలో సంసిద్దులను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల సమస్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ ఎంఈఓ దృష్టికి తీసుకుపోయారు. మన ఊరు మన బడి కింద రావాల్సిన డ్యుయేల్ డెస్క్ బెంచీలు రాలేదని, పాఠశాలలో తరగతి గదులు సైతం సరిపోవడం లేదని, వర్షం కురిస్తే కొన్ని తరగతి గదులు కురుస్తున్నాయని, అదనపుగదులను మంజూరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులు ఎంఈఓకు విన్నవించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

### ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం పట్ల హర్షం

**మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు27 ప్రభాతవార్త:** సుప్రీం కోర్టులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావడం పట్ల మెదక్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు హర్షం వ్యక్తంచేశారు.మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో సంబంధం ఉందని బీజేపీ ప్రభుత్వం అర్థం లేని కేసులో అక్రమంగా కల్వకుంట్ల కవితను ఇరికించడం దురదృష్టకరమని, న్యాయస్థానంపై బీఆర్ఎస్ పార్టీకి నమ్మకం ఉందని, తప్పకుండా వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ ప్రజా బలాన్ని చూసి బీజేపీ, కాంగ్రెస్‌లు కుమ్మక్కై ఉమ్మడిగా కుట్ర పన్ని కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని బీజేపీ ప్రభుత్వం కవితను అక్రమంగా అరెస్టు చేయించి కేసీఆర్ మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఒక పథకం ప్రకారం బీఆర్ఎస్ పార్టీని ఓడించడానికి పన్నిన పథకమని బీఆర్ఎస్ పార్టీ నమ్ముతుందన్నారు. ఎప్పటికైనా న్యాయస్థానంలో న్యాయం జరుగుతుందని, కవిత బెయిల్‌పై హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

**పెద్దశంకరంపేట, ఆగస్టు27 ప్రభాతవార్త:** అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలో 31 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన లబ్ధిదారులకు చెక్కులు సక్రమంగా అందించలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలను అందజేస్తుందన్నారు. మండల కేంద్రంలో 500 మంది పేదలకు ఇళ్ల స్థలాలను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని, స్థలాన్ని వెంటనే గుర్తించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గ్రేసీబాయి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మధు, సీనియర్ నాయకులు నారాగౌడ్, ఆర్ఎన్. సంతోష్, సంగమేశ్వర్, సత్యనారాయణ, రాజేందర్‌గౌడ్, బాసాడ రాజు, సుభాష్‌గౌడ్, కుంట్ల రాములు, కుంట్ల శ్రీను, పెరుమాండ్లుగౌడ్, గోవింద్‌రావు, రోమాల సాయిలు తదితరులు ఉన్నారు.

### అకౌంటెంట్ మృతి

**కంగ్టి, ఆగస్టు 27 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోగల కస్తూర్బా గాంధీ పాఠశాలలో పనిచేస్తున్న సుస్మితరెడ్డి మంగళవారం మృతి చెందారు. కంగ్టి కస్తూర్బా గాంధీ పాఠశాలలో పది సంవత్సరాలనుంచి అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తుంది. ఆమె స్వగ్రామం కంగ్టి మండలం తడ్కల్. సుస్మితరెడ్డి రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల కస్తూర్బా గాంధీ పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు.